*"కొన్నువ్వేన్నైనా చెప్పారేయ్. అప్పనేది ఈ భూప్రపంచంలో ప్రతి మనిషికి అత్యవసరమైనది. దానవసరం లేకుండా జీవితం వెళ్లబుచ్చగలవ(ను కోవడం నా ఉద్దేశంలో అవివేకవే(" మళ్లీ సంభాషణని తిరగతోడాడు భద్రం*

"ఏమో – అదంతా నాకనవసరం. నేననేది మాత్రం ప్రతి మనిషీ మాటికి మూరుపాళ్లూ తమకున్న దాంట్లో సర్దుకుపోవాలిగానీ వెధవ భేషజాలకి పోయి, అప్పసొప్పులేసి, అవి తీర్చలేక నానాపాట్లూ పడ్డం, కుటుంబ గౌరవాన్ని బజారు కీడ్చడం – ఇదంతా నాకు సుతరామూ యిష్టం వుండదు." తల అదేపనిగా అడ్డంగా వూపుతూ అన్నాడు విఠల్.

"ఇందులో పెద్ద పాట్లుపడ్డానికేవుందిరా ? ఏదో అవసరార్థం తెలుసున్నవాణ్ణి కొంచెం సర్దరా అంటాం – రావల్సిన డబ్బు చేతి కందగానే వాడిది వాడి మొహాన కొడతాం. జస్ట్ ఏన్ అడ్జస్ట్‌మెంట్. సర్దినవాడు మహరాజా కాడూ – తీసుకున్నవాడు అడుక్కునేవాడూ కాడూ." కొంచెం తీవ్రంగానే అన్నాడు భద్రం.

"లక్ష చెప్పు నువ్వు. నా ఉద్దేశవది. ఎవరి మాటో నాకు తెలియదుగానీ – నేను మాత్రం ఛస్తే అప్పు తీసుకోకూడదని నిర్ణయించేసుకున్నాను."

"ఒరేయ్ – చెప్తున్నాను. అనవసరంగా తొందరపడి అలాటి ప్రమాదకరమైన నిర్ణయాలు, ప్రమాణాలు తీసేసుకోకు. అప్పు అనేది మహా జగమొండి. దాని పంతం అంతా యింతాకాదు. తీసుకోనని భీష్మించుక్కూర్చున్నవాళ్లనే ఎక్కువ వరిస్తుందది. అంతెందుకు – నేనుకూడా ఛస్తే అప్పు తీస్కోకూడదని అనుకున్నా. కానేం చేస్తాం – ఈనాడు తీస్కోక తప్పడంలేదు నీదగ్గర." చివరి మాటలు తేలిగ్గా అనేసి, ఒక సిగరెట్టు వెలిగించుకుని, మరోటి విఠల్‌కి ఆఫర్‌చేసాడు భద్రం.

సిగరెట్టొద్దన్నట్లుగా చెయ్యి అడ్డంగా ఊపుతూ, "ఇప్పుడు నానుంచి నీకు అప్పు కావాలన్నమాట. మరలా డైరెక్టుగా ఏడవ కూడదూ !? ఓరి డ్రాపివి కదరా డ్రాపీ ! తీసుకో– నే వొద్దంటేగా ! ఏమాత్రం కావాలేవిటి, అయిదా ... పదా ... పాతికా ?" అన్నాడు విఠల్ – వెధవ్వేషాలేసినందుకు భద్రంకేసి కొంచెం చులకనగా చూస్తూ.

"నువ్వు తేలిగ్గా అనేసిన అయిదు, పదుల్లాంటివి నా ప్రస్తుత అవసరాలైతే నీదాకా వచ్చేవాడ్నికాదు. ఆమాత్రం అవసరాలకి మాలో మేము ఆదుకోవడానికి ఓ యాభైమంది మెంబర్లున్న సంఘవోటుంది మాకు. కాని నాకిప్పు డర్జంటుగా కావాల్సింది కొంచెం పెద్దమవుంటు. అఫ్‌కోర్సు – నువ్వు సర్దగలవనుకో. ఇందులో ఏవుందిరా పెద్ద – జస్ట్ ఏన్ ఎడ్జస్ట్‌మెంట్ – ఇప్పుడు నాకు నువ్వు సర్దుతావు. రేపెప్పుడైనా నీ కవసరంవొస్తే మహరాజులా నన్నడగొచ్చు నువ్వు." అతి సామాన్యంగా అన్నాడు భద్రం.

"ఒరేయ్ ! ఎందుకొచ్చిన డొంకతిరుగుడిది చెప్పు ? నిన్ను అప్పు అడుక్కోవలసిన అవసరం నాకు పట్టదు – పట్టకూడదు. నిన్నేకాదు – మరెవర్నీకూడా అప్పడుక్కోవలసిన అగత్యం నాకు పట్టదు. సరా ?"

"దూరవాలోచించట్లేదు నువ్వొరేయ్. ఎప్పటికైనా నీకా అవసరం పట్టితీరుతుంది చెబ్తున్నా."

"ఇంపాసిబుల్. పట్టదు ... పట్టదు ... పట్టదు. అంతగా అవసరం పట్టిన్నాడు నువ్వు నన్ను మారుపేరుపెట్టి పిలవ్వొచ్చు. ఇంతకీ నీకు నేను యిప్పుడు సర్దననటంలేదుగా – ఎందుకొచ్చిన బెదిరింపులివి ? ! ఎంత కావాలో తొరగా చెప్పేడు." గొంతు స్థాయి హెచ్చించి, విసుక్కుంటూ అన్నాడు విఠల్.

"మారుపేరుపెట్టి పిలవ్వొచ్చా ? ! ఆల్‌రైట్. ఊ. సరే. ప్రస్తుతం నాకు నాలు గొందలు కావాల్రా" – ఏవంటాడోనన్నట్లుగా విఠల్ కళ్ళల్లోకి సూటిగా చూస్తూ అడిగాడు భద్రం.

విఠల్ కొంచెం కంగారుతిన్నమాట మాత్రం యదార్థం. కాని వెంటనే తమాయించుకుని, "సరే, నాతో రా. ఇప్పుడే బ్యాంకులో డ్రా చేసిస్తాను." అన్నాడు.

విఠల్ నుంచి డబ్బందుకుంటూ, "థేంక్సురా అబ్బాయ్ ! 'ఎ ఫ్రెండ్ 'ఇన్ నీడ్ ఇజ్ ఎ ఫ్రెండ్ ఇండీడ్' అన్నారు మన పూర్వీకులెవరో మనం పుట్టడానికి చాన్నాళ్ల క్రితవే. అఫ్‌కోర్స్ ఆమాటలు మనం పుట్టేసాక్కూడా – అసలు యీ ప్రపంచవున్నంతకాలం వుపయోగిస్తాయనుకో. ఎనీహౌ. సమయానికి సర్దావు. నీ మేలు మర్చిపోను. ఈ నాలొందల్లో రెండొందలు ఎల్లుండి మధ్యాన్నానికల్లా నీ కిచ్చేస్తాను. పోతే

# అప్పు



తులసీ బాలకృష్ణ



హైదరాబాద్‌లో రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ బేగం అలీ అహ్మద్‌లను కలుసుకుని మాట్లాడుతున్న శ్రీమతి లక్ష్మీ రఘురాం.

మిగతా రెండొందలకీ యింకో రెండ్రోజుల టైము కావాలి నాకు." అన్నాడు భద్రం రూపాయినోట్లని అలవాటు ప్రకారం పేకముక్కల్లా కలుపుతూ.

"మరేం తొందరలేదురా. నాకసలు యిప్పుడప్పుడే ఏవీ యివ్వవసరంలేదు. నీదగ్గరుంచ్చే. ఏంవవుతుందని ?!"

"ఎందుకురా — రెండొందలు ఎల్లుండి తీసేస్కో చెబ్తాను."

"అలాకాదు. నాలుగొందలూ నీదగ్గరే వుంచ్చే చెబ్తాను. ఎందుకంటే డబ్బు నీదగ్గరుంటే మరెక్కడికీ పోదు. నాదగ్గరుంటే ఖర్చయిపోతుంది. బ్యాంకులో వేసుకున్నా — అవసరవున్నా లేకపోయినా డ్రా చేసేస్తూంటాను. అందుకని. నీదగ్గర దాచుకున్నాననుకో."

"నిజం చెప్పాలంటే నాకూ కూడా చాలా సిగ్గుగా వుందిరా — అప్పుమీద ఏమాత్రం సదభిప్రాయం లేని నీదగ్గరే అప్పు తీసుకుంటున్నందుకు. కానీ నేనుకూడా ఒకటంటాను — జన్మలో ఛస్తే ఆడదాని దగ్గర మాత్రం అప్పు తీసుకోకూడదు. అంతకంటే అధ్వాన్నప్పని మరోటుండదు. నేను మాత్రం ప్రాణంపోయినా ఆడదాన్దగ్గర అప్పు తేస్కోకూడదని డిసైడ్ చేసేస్కున్నాను." తనకీ కొన్ని ప్రిన్సిపుల్స్ అప్పు విషయంలో వున్నాయని చెప్పుకోవడానికి తెగ గింజుకోసాగాడు భద్రం.

"సరేలేరా ... మరేం ఫర్వాలేదులే. మరచిపోయింకీ విషయం. అచ్చా! వస్తామరి. బై." అని, చిన్నగా నవ్వుకుంటూ యింటివైపు నడిచాడు విఠల్, 'అవసరవున్నా లేకపోయినా అప్పులు చెయ్యడం మాత్రం మానరుగదా యీ వెధవలు' అని తనలో తనే అనుకుంటూ.

* * *

'సిల్కు సెంటర్'లో కూతురు చెప్పిన గుర్తుల ప్రకారం చుక్కలచీర ధర కనుక్కుని,



# అప్పు

మళ్లీ వస్తామని చెప్పి, బయటకొస్తూ భద్రంతో నెమ్మదిగా అన్నారు సుబ్బరామయ్యగారు, "అసలు యీ ఊళ్ళో సుబ్బారావుగారనే ఆయన్ని కలవాలనే ఉద్దేశంతో యీ వూరొచ్చానన్నమాట. నాయనా! ఆయన్తో కొన్ని ముఖ్యమైన పనులూ వున్నాయి, ఆయన్నాకు కొంత పైకంకూడా యివ్వవలసివుంది. ఆయన డబ్బిస్తే ... యిదుగో ... యీ చీర, ఇంకా కొన్ని ముఖ్యమైన వస్తువులు మా వూరు పట్టుకెళ్దామనుకున్నాను. ఇంతా చేస్తే ఆయన ఊళ్లో లేరు. పాపం, మా అమ్మాయి మరీ మరీ చెప్పింది యీ ఊర్నుంచి ఆ చుక్కలచీర తెచ్చిపెట్టమని — వెర్రిపిల్ల. కానేం చేస్తాం మరీ! ఒక్కోసారిలాగే పరిస్థితులు తారుమారవుతూంటాయి. అసలు తప్పు చేసాను నేను. కనీసం యీ చీర కొనడానికి సరిపోయే డబ్బైనా తీసుకు రావల్సింది." తనలో బాధపడుతోనే, మాటలు అన్యమనస్కంగానే బయటకు వదిలేసారు — అమ్మాయికి చీర కొనడానికి సమయానికి చేతిలో డబ్బు లేకపోయినందుకు తెగ బాధపడిపోతూ.

"ఈ విషయంలో పెద్ద మీరంతలా బాధపడ్డాకేంవుంది మేష్టారూ! విఠల్‌ని సద్దమంటే ఆమాత్రం సద్దడా?! ఏదో మీరనుకున్న ప్లాను తలకిందులై ఆ సుబ్బారావుగారెవర్నో మీరు కలవలేకపోవడం వల్లగానీ ... లేకపోతే మీకేం అవసరం?! ప్రస్తుతానికి ఓ రెండొందలు సద్దమంటారు — రేపు మీ ఊరెళ్లగానే మనిఆర్డరు చేసేస్తారు. ఇందులో ఏవుంది పెద్ద! ఇంకేం ఆలోచించక మీరలా చెయ్యండి చెబ్తాను. బండికి మీకు యింకా మూడు గంటలుంది. వాడీపాటికి రూము కొచ్చుంటాడు. వెంటనే వెళ్లండి. వాడుకూడా మీకనేసరికి ఎంతో ఆనందంతో సద్దేస్తాడు." అన్నాడు భద్రం — 'ఈ అవకాశం వినియోగించుకుతీరాలి' అనికూడా అనుకున్నాడు తనలో.

"అది నిజవేననుకో. కాని — అతని రూములో దిగడవేకాకుండా పాపం యిప్పుడు అప్పుకూడా అడిగితే బావుంటుందా అని. పైగా పాపం అతని దగ్గర యిప్పుడు డబ్బు సిద్ధంగా వుండొద్దూ..." అంటూ నసిగారు మేష్టారు.

"అయ్యో, యిందులో తప్పేంవుంది సార్?! జస్ట్ ఏన్ అడ్జస్ట్‌మెంట్. ఓ రెండొందలు సద్దలేడంటారా? వాడి గురించి మీరెరగరన్నమాటయితే. పైగా పాపం, మీ అమ్మాయి మీరు చీర తెస్తారని ఎంతో ఆశగా ఎదురుచూస్తూంటుంది మీ ఊళ్లో. మీ రొట్టి చేతుల్తో వెళ్తే...ఆలోచించండి మీరే."

"అయితే విఠల్‌ని అడిగెయ్యమంటావా..." యింకా నసిగారు మేష్టారు.

"నిరభ్యంతరంగా. ఏమాత్రం సంకోచించాల్సిన అవసరంలేదు. వెళ్లిరండి. మళ్లీ మీ ట్రయిన్ టైముకి స్టేషన్ కొస్తాన్నేను. ఆఁ అన్నట్టు — నే నడగమన్నట్టుమాత్రం చెప్పకండి—బావుండదు." అంటూ ఆయన్ని ఉత్సాహపరచి, తనని గురించి జాగర్తపడ్డాడు భద్రం.

* * *

"అదేవిటి మేష్టారూ! చిన్నప్పట్నుంచీ మీదగ్గర చదువుకుంటూ మీ ఇంట్లో పెరిగినవాణ్ని. మీ అబ్బాయిలాంటివాణ్ని. నాదగ్గర మీరు మొహమ్మాటపడ్డవేంటి మేష్టారూ! అందులో యింత చిన్న విషయంలో. ప్రస్తుతం మీకు వీలు కాకపోబట్టిగానీ - మీకు డబ్బు సర్దగల స్తోమతుగల వాడినిటండీ నేను?! మీరే పదిమందిని ఆదుకోగలరు. అచ్చా! మీరు రెస్టు తీసుకొంటూండండి మేష్టారూ! ఒక్క పావుగంటలో వచ్చేస్తాను నేను. చెల్లాయికి మీరు చీర కొని పట్టికెళ్లాల్సిందే." అంటూ సైకిల్‌మీద వాయువేగంతో దూసుకుపోయాడు విఠల్.

* * *

భద్రం, సుమతి చదరంగం వేసుక్కూర్చున్నారు. ఆట అయితే ఆడుతున్నాడుగానీ భద్రం మనస్సు అంతా విఠల్ వచ్చిన తర్వాత వుండే పరిస్థితిమీదే నిమగ్నమయివుంది. అతనిలో ఏదో వింత ఆనందం. సుమతి సైన్యం శత్రురాజుని చుట్టుముట్టింది. ఇంక ఎంత తక్కువ ఎత్తులతో ఎదుటి రాజుని బంధించెయ్యగలనా అని సుమతి తెగ ఆలోచించేస్తూ, కణతలు నొక్కుకుంటోంది.

సరిగ్గా ఆ సమయంలోనే —

'హాయ్' అంటూ భద్రం బోర్డు ఎత్తేసాడు.

"చూసావా కుళ్లు — ఆట పోతోందని....' అంటూ ఏడుపుమొహంతో ఏదో అనబోయిన సుమతి భద్రం చూపు ప్రసరించినంతదూరం చూసి, అక్కడ క్యాలెండర్ని తదేకంగా చూస్తూ నిల్చున్న విఠల్‌ని చూసి, నాలుక్కరుచుకుని, వాళ్ల వాటాలోకి పరిగెత్తింది.

"రా గురూ రా" అంటూ ఆహ్వానించాడు భద్రం విఠల్‌ని, కుర్చీ తన ప్రక్కగా లాక్కుంటూ.

విఠల్‌ని కళ్లతోనే త్రాగేస్తూ రెండు వాటాల మధ్య నున్న గుమ్మం తాలూకు కర్టెన్‌ని లాగింది సుమతి. సుమతి యింటివాళ్ల అమ్మాయి. ఆ అమ్మాయి నాన్న ఓ మిలట్రీ ఆఫీసరు. సుమతి ఒక్కర్తే కూతురు వాళ్లకి. అందుకనే వయస్సు వచ్చినా ఆ అమ్మాయికి సిగ్గు రానందుకు వాళ్లకి కోపంరాదు. విపరీతమైన స్వేచ్ఛ నిచ్చేసారు. నాలుగేళ్లబట్టీ అదే రూంలో వుంటూ, నమ్మకస్తుడైన కుర్రాడవడంతో భద్రం రూంలోకి వెళ్లడానికి అసలు అభ్యంతరం చెప్పరు.

సుమతి అందంగా వుంటుంది. పైపెచ్చు సరైన ఒడ్డూ, పొడవూగా వుంటుంది. ఆమె ఒక మనస్సుని కలిగివుండడమే గాక — ఆమెకు తెలియకుండానే ఆ మనసు విఠల్ వచ్చినప్పుడల్లా అదోలా లోలోనే రవళిస్తుంది. అస్సలు నిజం చెప్పెయ్యాలంటే — అసలు ఆమె సిగ్గంటూ పడుతుందంటే ఒక్క విఠల్ దగ్గరే.

"ఒరే భద్రం! మేష్టారివాళ వెళ్లిపోతున్నారు తెలుసుగా! అనుకోకుండా పాపం ఆయనకి డబ్బు అవసరం పడింది. నాడబ్బు నీదగ్గరుందిగా. ఓ రెండొందలియ్యి."

భద్రం విఠల్‌ని ఆశ్చర్యంగా చూసాడు. పైగా ఫక్కున నవ్వేసాడు. "ఏరా, ఏంవైనా పుచ్చుకునొచ్చావా జోకు లేస్తున్నావు." అన్నాడు వెకిలిగా.

విఠల్‌కి కొంచెం చిరాకు అనిపించింది.

"ఒరేయ్ భద్రం! రేపు తీరుబడిగా వస్తాను. హాయిగా జోకు లేసుకుందాం. నాకిప్పుడు కొంచెం బోరుకొట్టించక డబ్బియ్యి. ఇంకా చిరొకటి వాళ్ళమ్మాయికి కొనాలి. మళ్లీ ట్రయిను కందుకోవాలి."

"నీ తొందర బాగానేవుందిరా. కాని నువ్వు డబ్బు కావాలని జోక్కంటున్నావా, నిజంగానా ?" కొంచెం సిన్సియర్‌గానే అడిగాడు భద్రం.

"ఓ మూల లైమయిపోతోందిరా అంటూంటే జోకులేవిట్రా నా పిండాకూడూ." మండిపడ్డాడు విఠల్.

"నీ సీరియస్‌నెస్ తగలడ్డట్టే వుందిగానీ— యిప్పుడు నువ్వడిగేది అప్పా ?"

"అప్పేవిటి నీ శార్ధం ?! నా నాలుగొందల్లో ఓ రొండొంద లియ్యమంటున్నాను." చిర్రెత్తి పోతోంది విఠల్‌కి.

"నీకే దెయ్యావోఁ పట్టినట్టుందిరా అబ్బాయ్. నిన్నగాక మొన్ననేగదరా నీ డబ్బు అణాపైసల్తో నీకు యిచ్చేసాను—యిప్పుడు మళ్లీ నీ నాలుగొంద లేవిటి ?"—తడబడకోయి, సరిగ్గానే అనెయ్య గలిగాడు భద్రం.

తలపై పిడుగు పడ్డట్టయింది విఠల్‌కి.

ఒక్కసారి వూపిరి పీల్చుకుని, "ఒరేయ్ భద్రం! నీకు చేతులెత్తి దణ్ణం పెడతాను. పరిహాసాల కిదికాదు సమయం. త్వరగా డబ్బియ్యి. పాపం, ఆయనకి ట్రయిన్‌కి టైమయిపోతోంది" అన్నాడు విఠల్—కోల్పోతున్న సహనాన్ని కూడగట్టుకుని.

కర్టెన్ అవతల అయిన చిన్న నవ్వడికి మరింత చిన్నగా, సంతృప్తిగా నవ్వుకున్నాడు భద్రం. 'విఠల్‌గాడి పట్టుదల ఏంటో యిప్పుడు యీమెకీ తెలిసొస్తుంది—విఠల్ ఏదో పెద్ద మాటమీద నిలబడేవాడనుకుంటోంది' అనుకున్నాడు. విఠల్




dCA/GL/41 TEL

మాత్రం ఏ చప్పుళ్ళూ వినగలిగే పరిస్థితిలో లేదు.

"ట్రయినుకి టయిమయిపోతోందని నాదగ్గర తొందరపడితే నేనేం చెయ్యగలనురా? నీడబ్బయితే నీకిచ్చేసాను. అప్పుగా కావాలంటావా – మహరాజులా తీసుకెళ్ళు." కుర్చీ మీంచి లేస్తూ మొహం గోడవైపుకు తిప్పుకుని అన్నాడు భద్రం.

పిచ్చెక్కిపోతున్నట్లుంది విఠల్‌కి. అమాంతం కలియబడి భద్రం పీకపిసికి చంపెయ్యాలనుంది. కాని కొట్టుకోవడానికి, చంపుకోవడానికి సమయం కాదిది. బ్యాంకు వేళ కూడా కాదు. ఇంకోడెవడి దగ్గరకయినా వెళ్ళినా అప్పుగానే అడగాల్సొస్తుంది. పైగా దొరుకుతుందన్న నమ్మకంలేదు. వాళ్ల యిళ్లుకూడా దగ్గర్లో లేవు.

"ఒరేయ్ భద్రం! నువ్వెందుకింత అన్యాయంగా మాట్లాడుతున్నావో తెలియట్లేదు. మొన్న నువ్వు నా డబ్బులో రెండొందలు తిరిగిస్తుంటే 'నీదగ్గరే వుంచరా' అన్లేదు నేనూ? భగవంతుడి మీద ప్రమాణం చేసి చెప్పరా నా డబ్బు నీదగ్గర లేదని" గుడ్ల నీళ్ళు కుక్కుకుని, దగ్గుత్తికతో, భద్రం రెండు భుజాలూ పట్టుకుని, తనవైపుకి తిప్పుకుని అడిగాడు విఠల్. ఇలాకూడా అన్నాడు – "ఒరేయ్, నీక్కావాలంటే రెండొందలూ రేపు బ్యాంకు తెరవగానే యిస్తాను. నీకు శక్తి లేకపోతే తీర్చక్కర్లేదులేరా. ఇప్పుడు మాత్రం యివ్వరా. మరోహరు మరోహరూ కాదురా. సుబ్బరామయ్య మేష్టారితో పనిరా. మాటిచ్చి, యిప్పుడు నేను డబ్బు సర్దలేకపోయానంటే యింక నాకు ఆత్మహత్యే శరణ్యంరా."

"ఒరేయ్ – నువ్వు వెర్రాడివో మంచాడివో తెలియట్లేదు నాకు. అసలు నీ ప్రవర్తనే నాకు వింతగా వుంది. నీ డబ్బు నీ కిచ్చేసాక్కూడా నువ్వు యిలా అడగడం చాలా అసహ్యమనిపిస్తోంది నాకు. అఫ్‌కోర్సు – ప్రస్తుతం నా దగ్గర డబ్బుంది. నీకు సర్దగల్నుకూడా. 'అబ్బాయ్, ఓ రెండొందలు అప్పు కావాల్రా' అని అడుగు, మహరాజులా తీసుకో. అంతేకాని, యిదేం డబాయింపురా అర్ధం లేకుండా?!" అసహ్యంగా అన్నట్టుగా అన్నాడు భద్రం – విఠల్‌ని యీసడింపుగా చూస్తూ.

"నా జీవితంలో అప్పు అడక్కూడదని నిశ్చయించుకున్నానని నీకు తెలియదా?" – నూతిలోంచి వచ్చినట్లున్నాయి మాటలు.

"ఆఁ – ఈ నిర్ణయాలూ, ఒట్లూ సాగినంత సరకేరా. పైగా అవతల డబ్బు తెస్తానని మేష్టారి కిచ్చిన మాట ముఖ్యవాఁ – నీ అర్ధం పర్ధం లేని ప్రిన్సిపుల్స్ ముఖ్యవాఁ? కాపోయినా మనలో మన కేవిటి? నేన్నీదగ్గర అప్పు తీస్కోలేదూ? అలాగే నువ్వు నా దగ్గర తీస్కోవచ్చు. ఇందులో పెద్ద తప్పేముంది? మానవమాత్రుడైనవాడి కెవరికైనా ఆ అవసరం వస్తుందిరా."

విఠల్ తల పట్టుకుని కూర్చుండిపోయాడు. రెండు నిమిషాలు పోయాక తలెత్తాడు.

"నా ప్రిన్సిపుల్స్‌కంటే కూడా మేష్టారి కిప్పుడు డబ్బు సర్దడవేఁ ముఖ్యమనిపిస్తోంది. నేను పుట్టి బుద్దెరిగి యిప్పటివరకూ యెవ్వరికీ యెటువంటి కీడూ తలపెట్టలేదు. ఎవరి పాపానికి వాళ్లే పోతారు. సరే – ఒరేయ్, నాకు అర్జంటుగా రెండొందలు 'అప్పు' కావాలి. ఇవ్వు. రేపిచ్చేస్తా."

ఒక్కసారిగా బర్స్ట్ అయి గుక్క తిప్పుకోకుండా నవ్వేసాడు భద్రం. అందులో ఆనందం, విజయ గర్వం వున్నాయి. నవ్వి, నవ్వి కళ్లనీళ్లు చిమ్మాక ఆగాడు.

"చూసావురా చిట్టికన్నా – అవసరం ఎంత పని చేయిస్తుందో! అప్పు అడిగేవాడు సరదాకి అడగడురా. అవసరం – దాని సిగ్గోసిరి – దాన్ని దాటడం బ్రహ్మతరం కాదు. ఇంకో సందర్భంలో అయితే నీ డబ్బు నా దగ్గర లేదన్నందుకు తిట్టేవాడివి, కొట్టేవాడివి, చంపిపారేసేవాడివికూడా. కాని యిప్పుడు వాటికంటే విలువైంది నువ్వు మేష్టారి కిచ్చిన మాట. అది నిలబెట్టుకోవాలి. దానిముందు నువ్వూ, నీ ప్రిన్సిపుల్సూ బలాదూర్. ఏఁవంటావ్? ఇప్పటికైనా అర్ధవఁయిందా – నేన్నిన్నెందుకు, ఏ పరిస్థితుల్లో అప్పు అడగాల్సొచ్చిందో?! కాబట్టి, అప్పడిగేవాణ్ణి యెప్పుడూ చులకనగా చూడకు. కానీ – ఆడదాన్ని మాత్రం ఛస్తే అప్పడక్కూడదని లైఫ్‌లో మర్చిపోకు. ఓకే?... నీ డబ్బు సురక్షితంగా వుంది. ఇస్తా, నాతో రా. నీ డబ్బు కాజెయ్యాల్సిన ఖర్మ నాకేం పట్టలేదు, అవసరానికి నీ డబ్బు నీ కివ్వనంతటి రాక్షసుణ్ణీ కాదు"

ప్రగతికి మూలం
క్రమశిక్షణ

అంటూ కర్టెన్ తొలగించి ప్రక్క వాటాలోకి దారి తీసాడు భద్రం. వెనకనే విఠల్ కూడా వస్తూండడంతో ఆ గుమ్మం దగ్గరే తచ్చాడుతూన్న సుమతి లోపలకి పరిగెత్తింది.

విఠల్‌కి కూర్చోమని సంజ్ఞచేస్తూ, "సుమా– ఇలా రా ఓసారి" అని పిలిచాడు భద్రం.

"కాఫీ కలుపుతున్నా.." అంది సుమతి – విఠల్ తమ యింటికి వచ్చాడన్న ఆనందంలో వుక్కిరి బిక్కిరి అవుతూ గొంతు పెగలక.

"ఒద్దు – అంత టైము లేదుగానీ ఓసారిలా రా" ఓ విధమైన అధికారయుతమైన స్వరంతో పిలిచాడు భద్రం విఠల్ పక్కనే కూర్చుంటూ.

అతి నెమ్మదిగా వచ్చి, గుమ్మానికి జేర్లబడి నిల్చుంటూ, "ఏఁవిఁటీ" అంది వీణ మీటినట్లు. తల వంచుకుని కూర్చునివున్నాడు విఠల్.

"ఆఁ ఏంలేదూ. ఓ రెండొందలియ్యి – అర్జంటుగా కావాలి."

"రెండొందలా?! ఎక్కడ్నుంచి తెమ్మంటావ్?"

"సరే, ఇంక నువ్వు జోకులు మొదలెడ్తే తెల్లారినట్లే. త్వరగా యియ్యి."

"అరె – తొరగా అంటే... ఎక్కడ్నుంచి తేనూ?!"

"మొన్ననేగా దాచమని నాలుగొందలిచ్చిందీ!"

"బడాయి. ఇది చాలా బావుంది. నువ్వు – నాకు – దాచమని – నాలుగొందలిచ్చావా? భేష్!" నవ్వేసింది.

దెబ్బతిన్నాడు భద్రం.

విఠల్ అయోమయంగా చూస్తూ తలెత్తాడు. కాని సుమతి కోరుకున్నట్లుగా ఆమెవైపు చూడలేకపోయాడు.

"చూడు సుమా! అది విఠల్ కివ్వవలసిన డబ్బు. వాళ్ల మేష్టారికి అవసరం పడిందని ఓ రెండొందలిమ్మంటున్నాడు ప్రస్తుతానికి. ఇంకో గంటలో ఆయనకి బండుంది వాళ్ల వూరికి. ఆలస్యం చెయ్యకు. ప్లీజ్. తీసుకురా" కరక్కాయ అడ్డం పడ్డ గొంతులోనుంచి సన్నని దారి చేసుకుని, కొంచెం ప్రాధేయపడుతూ అడిగాడు భద్రం.

"ఏమో అబ్బాయ్! నా కదంతా తెలియదు. నీ డబ్బు ఏవీఁ నా దగ్గర లేదు. అంతగా అవసరవఁయి 'అప్పు'గా కావాలంటే నే నివ్వడానికి సిద్ధవేఁ" – లోపలకి పోబోతూ అంది.

"సుమా – ప్లీజ్ జోకులొద్దు..."

"జోకులేవిటి నా తలకాయ్. జోకులూ – గీకులూ. నిజవేఁ నేనన్నేది. అప్పుగా యిమ్మంటావా చెప్పు? అంతేగాని యిదేం డబాయింపూ అసహ్యంగా?" సూటిగా చూస్తూ అంది.

భద్రం ముఖం కందగడ్డలా అయింది.

విఠల్ ముఖంలో నెమ్మదిగా ఓ వింత కాంతి జొరబడుతోంది.

"నే పోతున్నాను బాబూ! ఆలోచించుకుంటూ కూర్చో. అవతల ఆ మేష్టారి కెవరికో ట్రయిను కాస్తా దాటిపోతుంది, వదిలిపోతుంది" అంటూ లోపలికి పోబోయింది సుమతి.

"సుమా!"... ఆగి, వెనక్కి తిరిగింది సుమతి అమాయకంగా చూస్తూ. "అలాగే అప్పుగానే యియ్యి ఓ రెండొందలు. మళ్లీ రేపిస్తా" తల వంచుకుని అన్నాడు భద్రం.

ఫక్కుమని నవ్వేసి, చివర్లో 'హుఁ...' అని కూడా అనేసి, లోపలకెళ్ళింది సుమతి.

లోపల్నుంచి డబ్బు తెచ్చి, భద్రం చేతికిస్తూ అంది, "చూడు భద్రం! అత్యవసరం అయినప్పుడే అప్పు చెయ్యాలనేది నీతిమంతుల సూత్రం. అప్పు చెయ్యాల్సొచ్చినప్పుడు కొంచెవైఁనా బాధపడ్డం, సిగ్గుపడ్డం పౌరుషం వున్నవాళ్ల లక్షణం. దానికి ఆడ, మగ తేడాలుండవు" అంది తీవ్రంగా. ఓ క్షణం ఆగి, "ఇదేం అప్పు కాదు – నీ డబ్బే" అనికూడా అంది.

నల్లగా బొగ్గులా మాడిపోయింది భద్రం ముఖం.

చంద్రుళ్లా వెలిగిపోతున్న ముఖంతో, మల్లెపెండులాంటి చిరునవ్వుతో, కృతజ్ఞతాయుతమైన మనస్సుతో – ప్రప్రథమంగా సుమతి కళ్ళల్లోకి చూసాడు విఠల్.

'మీ తరపున భద్రం గీర అణిచినందుకు మీ ఆ ఒక్క చూపు చాలండీ. ఇంక 'బాకీ' లేరు మీరు నాకు' అనుకుంది సుమతి లోలోనే, కనుదోయి అరమోడ్చి.